క్లుప్తంగా

రేపు డయల్ యువర్ డీఎం


కొడమంచిలి వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: ఈనెల 26న శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 'డయల్ యువర్ డిపో మేనేజర్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు బుధవారం విలేకరులకు తెలిపారు. ఆర్టీసీ ప్రయాణికులు, ప్రజలు తమ సలహాలు, సూచనలు తమ ఫోన్ నంబరు 99592 25536 కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు. ప్రజల సలహాలు, సూచనల మేరకు మరింత మెరుగైన సేవలు తమ డిపో నుంచి అందించడానికి కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

నేడు వల్లూరులో దంత వైద్య శిబిరం

కపిలేశ్వరపురం: కాకతీయ కమ్మ కిచెన్ సెంటర్ ఆధ్వర్యంలో మండలంలోని వల్లూరు గ్రామంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు బుధవారం తెలిపారు. గ్రామంలోని పాతూరి మాధవరావు రైస్ మిల్లు వద్ద నిర్వహించే శిబిరంలో రాజానగరానికి చెందిన లెనోరా డెంటల్ హాస్పిటల్ నిపుణులు దంత పరీక్షలు చేస్తారన్నారు.

వరద ప్రాంతాల్లో ట్రాన్స్‌కో ఉన్నతాధికారి పర్యటన


అద్దంకివారిలంకలో ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్న తిలక్‌కుమార్

కపిలేశ్వరపురం: మండలంలోని వరద ప్రాంతాల్లో బుధవారం ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ విభాగం జనరల్ మేనేజర్ కె.తిలక్‌కుమార్ పర్యటించారు. అద్దంకివారిలంక, నారాయణలంక, కేదారిలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంతో వ్యవహరిస్తూ విద్యుత్ సరఫరాపై నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆయన వెంటన అసిస్టెంట్ ఇంజినీర్ ఎస్.షాలెంరాజు, లైన్‌మేన్ ఎస్.ఏడుకొండలు, పల్లంరాజు, సత్యనారాయణ మూర్తి ఉన్నారు. స్థానిక పరిస్థితులపై సర్పంచ్ నాతి గవరయ్యతో చర్చించారు.

ఎంపీడీఓ మృతికి సంతాపం


నరసాపురం ఎంపీడీఓ మృతికి సంతాపం ప్రకటిస్తున్న మండల పరిషత్ సిబ్బంది

కె.గంగవరం: నరసాపురం ఎంపీడీఓ వెంకటరమణారావు అకాల మృతికి మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు సంతాపం ప్రకటించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద బుధవారం మృతి చెందిన ఎంపీడీఓ రమణారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం కొంతసేపు మౌనం పాటించి సంతాపం తెలియజేశారు. ఎంపీడీఓ ఎన్.శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ నరేంద్ర, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్మిత సబర్వాల్ క్షమాపణ చెప్పాలి


పలివెల రాజు

రామచంద్రపురం రూరల్: దివ్యాంగుల మనోభావాలు దెబ్బతినేలా ట్విటర్ వేదికగా అభిప్రాయాల్ని వెలిబుచ్చిన ఐఏఎస్ అధికారి స్మిత సబర్వాల్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల అధ్యక్షుడు పలివెల రాజు బుధవారం డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆమె బహిరంగంగా క్షమాపణలు తెలుపకపోతే అఖిల భారత దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

శెట్టిబలిజ సంఘం ఆర్థిక సాయం


మృతుడి కుటుంబ సభ్యులకు సాయం అందజేస్తున్న సంఘ నాయకులు

రామచంద్రపురం: గత ముప్పై ఏళ్లుగా పట్టణంలోని శెట్టిబలిజ కల్యాణ మండపంలో సేవలందిస్తున్న గుబ్బల సత్యనారాయణ (82) వృద్ధాప్య రీత్యా మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు తాలూకా శెట్టిబలిజ సంఘం తరఫున బుధవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కుటుంబ సభ్యులకు ఈ సొమ్ము సంఘ అధ్యక్షుడు కట్టా సూర్యనారాయణ, ఉపాధ్యక్షుడు నరాల ఏడుకొండలు, కార్యదర్శి వాసంశెట్టి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యుడు కడలి రామకృష్ణలు అందజేసి కుమార్తెలు, కుమారుడిని ఓదార్చారు.

తగ్గుతున్న గోదావరి

- ఊపిరి పీల్చుకుంటున్న ముంపు గ్రామాల ప్రజలు
- రెండు అడుగుల మేర తగ్గిన గోదావరి


కోటిపల్లి రేవులో ఫెర్రీ వద్ద రెండు అడుగులు తగ్గి ప్రవహిస్తున్న గోదావరి

కె.గంగవరం: ఉగ్రరూపం దాల్చిన గోదావరి బుధవారం ఉదయం నుంచి తగ్గుముఖం పట్టింది. మంగళవారంతో పోలిస్తే రెండు అడుగుల మేర వరద ఉధృతి తగ్గిందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. వరద ఉధృతి తగ్గుతుండడంతో గోదావరి పరివాహక ప్రజలు, ముంపు గ్రామ ప్రజలు కొంత వరకు ఉపశమనం పొందారు. కోటిపల్లి రేవులోని ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్‌ల చివరి వరకు ప్రస్తుతం వరదనీరు ప్రవహిస్తుంది. మత్స్యకార కాలనీలోని గట్టు ఒడ్డున ఉన్న ఇళ్లు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. గోదావరి ఉధృతి ఎక్కువగా ఉండడంతో బుధవారం కూడా పంటు ప్రయాణాన్ని రెవెన్యూ, పోలీసు అధికారులు నిలిపివేశారు. పూర్తి స్థాయిలో వరదనీరు తగ్గిన తరువాతే పంటు ప్రయాణానికి అనుమతిస్తామని వారు తెలిపారు. ముక్తేశ్వరం రేవు వద్ద గోదావరి పాయలో ఏర్పాటు చేసిన తూరలు ఎన్నడూ లేని విధంగా వరద ఉధృతికి కొట్టుకుపోయాయి. దీంతో పాటు సుమారు అర కిలోమీటరు మేర తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కంకర రోడ్డు కూడా వరద ఉధృతికి కొట్టుకుపోయింది.

కొనసాగుతున్న గస్తీ..

కోటిపల్లి రేవుతో పాటు మత్స్యకార కాలనీ, మసకపల్లి నుంచి కూళ్ల వద్ద వరకు గల ఏటిగట్టుపై పోలీసులు, రెవెన్యూ గస్తీ కొనసాగుతుంది. అనుమతి లేకుండా గోదావరిలోకి ఎటువంటి నాటుపడవలు వెళ్లకుండా వారి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. గోదావరి ఉధృతి తగ్గేంత వరకు గస్తీ ఉంటుందని స్థానిక తహసీల్దార్ రవీంద్ర తెలిపారు. అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు పల్లపు ప్రాంత ప్రజలు, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

కపిలేశ్వరపురం మండలంలో..

కపిలేశ్వరపురం: గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వాతావరణ మార్పులతో వర్షం తగ్గినప్పటికీ గత ఐదు రోజుల మాదిరిగానే గోదావరిలో వరద పరవళ్లు తొక్కుతోంది. మండలంలోని పలు గ్రామాల ప్రజలు గోదావరిని చూసేందుకు తీర ప్రాంత గ్రామాలైన తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్పగోదావరి గట్టుకు చేరుకుంటున్నారు. లంక గ్రామాల శివార్ల వరద కొనసాగుతోంది. ఎగువ ప్రాంతంలో గోదావరి నిలకడగా ఉండడంతో వ్యవసాయ క్షేత్రాలకు చేరే ప్రమాదం దాదాపు తగ్గినట్టే అని లంక గ్రామాల ప్రజలు భావిస్తున్నారు. అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాలను మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు బుధవారం సందర్శించారు. నారాయణలంకలో అంగర పీహెచ్‌సీ ఎంపీహెచ్ఈఓ జిత్తుక మల్లికార్జునుడు ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లోని వీధుల్లో చెత్తను తొలగించి, ముగ్గు జల్లించారు.


కేదారిలంక వరద ముంపు వద్ద గ్రామ అధికారులు


నారాయణలంకలో గ్రామస్తులకు వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న మల్లికార్జునుడు


కేదారిలంకలో ముగ్గు జల్లిస్తున్న పంచాయతీ కార్యదర్శి నరసింహారావు

విద్యా కిట్లు పంపిణీ


రామచంద్రపురంలో విద్యార్థులకు కిట్లు అందిస్తున్న కేతా శ్రీను, అంజమ్మ తదితరులు


లొల్లలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ తదితరులు


ద్రాక్షారామలో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందజేస్తున్న సర్పంచ్ అరుణ

రామచంద్రపురం: పట్టణంలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లు బుధవారం మున్సిపల్ పరిధిలో పాఠశాలలకు విద్యాకిట్లను పంపిణీ చేశారు. బ్రాడీపేట రాజాజీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కౌన్సిలర్‌లు కేతా శ్రీను, నల్లా అంజమ్మలు విద్యా కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న యూనిఫామ్స్, బ్యాగ్స్ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని మంచిగా విద్యను అభ్యసించాలని కోరారు. మూడో వార్డ్ పిల్లా వారి వీధి జవహర్‌లాల్ మున్సిపల్ ప్రాథమిక ప్రైమరీ పాఠశాలలో కౌన్సిలర్ అంకం శ్రీను విద్యార్థులకు కిట్లు అందజేశారు. పాఠశాల హెచ్ఎంలు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రాయవరం: మండలంలోని లొల్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం మల్లిడి చంద్రకళ ఆధ్వర్యంలో స్టూడెంట్ కిట్లను విద్యార్థులకు అందజేశారు. సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు వైట్ల సతీష్, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ లంక శ్రీనుల చేతుల మీదుగా స్టూడెంట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు సతీష్‌కుమార్, సుంకవిలికల గంగరాజు, ఉపాధ్యాయయులు విజశ్రీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ మండిపాటు

రామచంద్రపురం రూరల్: విద్యార్థులకు కిట్ల పంపిణీలో ప్రజాప్రతినిధుల కాని వారికి ప్రాధాన్యం ఇవ్వడం పట్ల ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ మండిపడ్డారు. మండలంలోని ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం కిట్లు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్‌గా తను, ఉప సర్పంచ్‌గా పెన్నాడ బుచ్చిరాజు, పలువురు వార్డు సభ్యులు హాజరయినప్పటికీ తమని పక్కన పెట్టి ఎటువంటి ప్రజా ప్రాతినిధ్యం లేని ముప్పనపల్లి గణేష్ అనే వ్యక్తిని ముందుగా పదేపదే ఆహ్వానించి అతనితో విద్యార్థులకు కిట్లు అందజేయడం బాధ కలిగించిందని సర్పంచ్ అరుణ విలేకరులకు వివరించారు. ప్రజాప్రతినిధులపై నిర్లక్ష్య ధోరణితో వ్యవస్థలకు సంబంధం లేని వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వడం సమంజసం కాదని తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి ప్రసాద్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్ ఏఈ ఎం.సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. మండలంలోని కుయ్యేరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని దుగ్గుదుర్రు, దుగ్గుదుర్రుపాటి, మేకలగరువు, కుయ్యేరు, రేగుబడవ, చింతల్లంక, ఉప్పుమిల్లి తదితర గ్రామాలకు గొల్లపాలెం 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, చీకట్లవారిపేట, మతుకుమిల్లి, తర్లంపూడి, టి.మామిడాడ, చేదువాడ, ఆర్యావటం, మొగలిపాలెం, బందనపూడి, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపోతుందన్నారు. గృహావసర వినియోగదారులతో పాటు, ఆక్వా, ఇండస్ట్రియల్ ఫీడర్ వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు.

కాటన్‌దొర చిరస్మరణీయుడు


రైతు వీరన్న చౌదరిని సన్మానిస్తున్న పాలతోడు గ్రామస్తులు

- పాలతోడులో ఘనంగా నివాళి
- వర్ధంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు

మండపేట: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ ఉభయ గోదావరి జిల్లాల వాసుల మదిలో చిరస్మరణీయమని మండలంలోని పాలతోడు గ్రామస్తులు పేర్కొన్నారు. గ్రామంలోని రైతులు, ప్రజలు కలసి బుధవారం కాటన్‌దొర వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలోని కాటన్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించి, ఆ విగ్రహాన్ని ధాన్యంతో అభిషేకించారు. గ్రామానికి చెందిన ప్రముఖ రైతు, పారిశ్రామికవేత్త నిమ్మలపూడి వీరన్న చౌదరిని ఈ సందర్భంగా రైతులు పూలమాల వేసి, శాలువా కప్పి సత్కరించారు. గ్రామానికి చెందిన దాతలు యేలేటి వెంకట్రావు, అన్నందేవుల వెంకటేశ్వరరావు తదితరులు సమకూర్చిన గొడుగులను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు, గ్రామ రెవెన్యూ సహాయకులకు పంపిణీ చేశారు. అలాగే విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు, బిస్కెట్లు, మిఠాయిలు కూడా పంచారు. కార్యక్రమంలో యేలేటి వీర్రాజు, సరాకుల అబ్బులు, పిల్లా లక్ష్మణరావు, పిల్లా తాతాలు, పిల్లా అరవరాజు, అన్నందేవుల వెంకట్రావు, పిల్లా నాగేశ్వరరావు, ఉల్లి వీర్రాజు, పిల్లా శ్రీనివాస్ , సుబ్బి వీరన్న, పిల్లా మంగరాజు, దొడ్డా వీరవెంకట్రావు , యేలేటి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు తక్షణ సాయం అందించాలి


తహసీల్దారు సురేష్‌కుమార్ వినతి పత్రం అందిస్తున్న రాజు

మండపేట: భారీ వర్షాలకు వరి పంట నష్టపోయిన రైతులందరికీ తక్షణ సాయం అందించాలని నవతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు నందికోళ్ల రాజు కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి తహసీల్దార్ సురేష్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ వారం రోజులుగా వర్షాలు కురవడం వల్ల వరి పొలాలన్నీ నీట మునిగాయన్నారు. పట్టణంలోని గొడ్డు కాలువ సైతం పొంగి పొర్లడంతో చేలల్లో ముంపు నీరు బయటకు పోయే మార్గం లేకుండా పోయిందన్నారు. దీనివల్ల సుమారు 1,500 ఎకరాల విస్తీర్ణంలోని పంట ముంపునకు గురైందని ఆవేదన వ్యక్త చేశారు. ఎక్కువ రోజులు పంటలు నీటిలో ఉండటం వల్ల వరినాట్లు కుళ్లిపోయాయన్నారు. బాధిత రైతులందరికీ తక్షణ సాయం అందించి ఆదుకోవాలని తహసీల్దార్‌ను కోరారు.

పారిశుధ్య నిర్వహణపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పారిశుధ్య నిర్వహణపై ప్రజలు శ్రద్ధ వహించాలని డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని పల్లిపాలెంలో బుధవారం ఐసీడీఎస్ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన స్వచ్ఛత వారోత్సవాల్లో డ్వామా పీడీ పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తున్నందున అపారిశుధ్య వాతావరణం తలెత్తితే అంటు వ్యాధులు వ్యాపించేందుకు అవకాశాలు ఉన్నాయన్నారు. స్థానిక అధికారులు, సిబ్బంది గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలు నిర్వహించి పరిసరాలను శుభ్రపరచటంతో పాటు, ర్యాలీలు, సదస్సులు నిర్వహించి ప్రజల్లో అవగాహన తీసుకువస్తారన్నారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ నాగేశ్వరశర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పీవీ కళ్యాణి ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞానం పెంచేలా శిక్ష సప్తాహ్

రామచంద్రపురం రూరల్: విద్యార్థుల్లో విజ్ఞానం పెంచేలా వారం రోజుల పాటు శిక్ష సప్తాహ్ కార్యక్రమం నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పిలుపునిచ్చారు. నూతన జాతీయ విద్యా విధానం అమల్లోకి వచ్చి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని జిల్లాలో పగడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. రామచంద్రపురం పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ హైస్కూల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ శిక్షా సప్తాహ్‌లో భాగంగా పిల్లల్లో విద్యా నైపుణ్యాల పెంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. వారికి స్పష్టంగా అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులందరికీ స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గిరజాల వెంకటసత్యసుబ్రహ్మణ్యం, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి


ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: రబీ సీజన్‌లో రైతులు విక్రయించిన ధాన్యం బకాయిలను వెంటనే వారికి చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. బుధవారం నాటి అసెంబ్లీ సమావేశాల్లో రైతు సమస్యలపై ఆయన గళమెత్తారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తం ధాన్యం బకాయి రూ.1,674 కోట్లలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.1000 కోట్లు చెల్లించిందన్నారు. మిగిలిన రూ.674 కోట్ల బకాయిలను కూడా రైతులకు చెల్లించి ఆదుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ళ ప్రభుత్వాన్ని కోరారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండపేట నియోజకవర్గంతో పాటుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పంట నీటి మునిగి పాడైపోయిందన్నారు. నష్టపోయిన అన్నదాతలను తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హెల్మెట్ ధారణతో ప్రాణరక్షణ

కొత్తపేట: ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి పి.రమణారెడ్డి సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి ఆధ్వర్యంలో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కోర్టుల సముదాయం నుంచి వాడపాలెం సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల డ్రైవింగ్, జాగ్రత్తలు, ముఖ్యంగా హెల్మెట్‌ధారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రయాణం సుఖవంతమవుతుందన్నారు. హెల్మెట్ ధరించకపోతే రూ.5 నుంచి రూ.10 వేల వరకూ జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ ప్రక్రియ ఈ నెల 1 నుంచి అమల్లోకి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు భాస్కరరావు, అడబాల ప్రభాకరరావు, కోర్టు సిబ్బంది, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ డీసీహెచ్ పాపారావు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్సై జ్వాలాసాగర్ హెల్మెట్‌ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పించారు.

రోగికి రూ.22,200 ఆర్థిక సాయం

మామిడికుదురు: బ్రెయిన్ సమస్యతో బాధపడుతున్న లూటుకుర్రు గ్రామానికి చెందిన బొంతు బుజ్జికి శెట్టిబలిజ సంఘం బుధవారం రూ.22,200 ఆర్థికసాయం అందజేసింది. మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాస్, కోశాధికారి పెచ్చెట్టి సత్యచంద్ర, సంయుక్త కార్యదర్శి కడలి నూకరాజు బుధవారం లూటుకుర్రులో బుజ్జి ఇంటికి వెళ్లి ఈ సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం ప్రధాన కార్యదర్శి గుబ్బల మనోహర్, కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్, సంఘం ప్రతినిధులు వాసంశెట్టి రామకృష్ణ, చింతపల్లి సతీష్, చప్పిడి సూరిబాబు పాల్గొన్నారు.

కౌలు కార్డులు ఎప్పటికి ఇస్తారో..

- లక్ష్యం 37,889 మంది
- మంజూరైంది 12,063
- కౌలు రైతుల ఎదురుచూపులు


వరి నాట్లు వేస్తున్న కూలీలు

రామచంద్రపురం రూరల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించి ప్రజలకు అందిస్తున్న రైతన్నలకు అండదండగా నిలవాల్సిన ప్రభుత్వం వారిని చిన్నచూపు చూస్తోంది. భూ యజమానులు ఎవరూ వ్యవసాయం ప్రత్యక్షంగా చేయడం లేదు. వారి భూమిని కౌలుకు ఇచ్చేస్తున్నారు. చాలా కాలంగా ఇదే విధానం కొనసాగుతున్నా ప్రభుత్వాలు రైతులకు అందిస్తున్న సహకారం ఈ కౌలు రైతులకు అందక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ వ్యత్యాసం గమనించి రైతు అనుకూల వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వంలో కౌలుదారీ చట్టం 1956ను రద్దు చేసి పంట సాగుదారుల చట్టం -2019 అమలలోనికి తెచ్చింది. భూ యజమానులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా కౌలు రైతులకు పంట సాగుదారు కార్డులు అందించి ప్రభుత్వం నుంచి అందే పంటం రుణం, సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇన్‌పుట్ సబ్సిడీ, భూసార పరీక్షలు, ఈ-క్రాప్ నమోదు, పంటకు బీమా, యంత్ర పరికరాల రాయితీ, కిసాన్ క్రెడిట్ కార్డులు వంటి అనేక ప్రయోజనాలు వారికి నేరుగా అందేలా చర్యలు తీసుకున్నారు. కానీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం మాత్రం కౌలు రైతులపై చిన్నచూపు చూస్తోంది.

ఇప్పటికి 32 శాతం మందికి మాత్రమే మంజూరు

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో 37,889 మంది రైతులకు పంట సాగుదారుల హక్కుల కార్డులు (సీసీఆర్‌సీ కార్డులు) మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. కానీ ఇప్పటికి 12,063 మందికి మాత్రమే ఈ కార్డులు మంజూరు చేశారు. అంటే కేవలం 32 శాతం మందికి మాత్రమే సీసీఆర్‌సీ కార్డులు మంజూరు చేశారు. గత ఏడాది ఖరీఫ్‌కు ముందుగానే అంటే ఏప్రిల్‌లోనే పంట సాగు గుర్తింపు కార్డులు జారీ చేశారు. కానీ ఈ ఏడాది ఖరీఫ్‌లో ఇప్పటికే జూలై నెల పూర్తయినా కౌలు కార్డుల జారీ సగం మందికి కూడా జరగలేదు. దీంతో కౌలు రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఎన్నికల నేపథ్యంలో కౌలు కార్డుల జారీలో ఆలస్యం జరిగిందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. కౌలు కార్డులు త్వరగా మంజూరు చేసి తమకు అందించాలని కౌలు రైతులు ఎదురుచూస్తున్నారు.

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లోని మండలాల వారీగా మంజూరైన కౌలు కార్డుల వివరాలు..

మండలం	నిర్దేశిత లక్ష్యం	మంజూరు చేసిన కార్డులు	మంజూరు శాతం
రామచంద్రపురం	5749	1919	33
కె.గంగవరం	4620	1092	23
కాజులూరు	6220	3310	53
మండపేట	7449	2121	28
రాయవరం	6946	1406	20
కపిలేశ్వరపురం	6905	2215	32

సాంకేతిక కారణాలతో ఆలస్యం..



గత ఏడాది ఏప్రిల్, మే, జూన్ నెలల్లో సీసీఆర్‌సీ కార్డుల మంజూరు చేయడం జరిగింది. అయితే ఈ ఏడాది ఎన్నికల కోడ్, సాంకేతిక కారణాలతో ఆలస్యమైంది. భూముల రీసర్వే కారణంగా వీఆర్‌ఓలకు ల్యాండ్ పార్శెల్ నంబర్లు రావడం ఆలస్యం అవుతుండటంతో దాని ప్రభావం కౌలు కార్డుల మంజూరుపై పడింది. ప్రస్తుతం కౌలు కార్డుల జారీ ప్రక్రియ జరుగుతోంది. రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందికి సూచనలు ఇవ్వడం జరిగింది. కొత్తగా ఎవరికైనా సాగుదారుల కార్డులు అవసరమైన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వీఆర్‌ఓల ద్వారా, ఆర్‌బీకేల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఎస్.సత్యప్రసాద్, ఏవో, రామచంద్రపురం మండలం

కౌలు రైతులందరికీ సాగుహక్కు కార్డులు ఇవ్వాలి



ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి పంటలు పండిస్తున్న రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలిచింది. కౌలు కార్డుల చట్టంలో సంస్కరణలు తెచ్చి వారికి ప్రభుత్వ సాయం అర్హులందరికీ అందే ఏర్పాట్లు చేసింది. కానీ టీడీపీ ప్రభుత్వంలో రైతులకు అందే సేవలు ఆలస్యమవుతున్నాయి. గతంలో పాసు పుస్తకం ఉంటే కౌలు కార్డులు అందించేవారు. కానీ ప్రస్తుతం రైతుల అనుమతి పత్రం కూడా తీసుకుని రావాలని కౌలు రైతులకు షరతులు పెడుతున్నారని అంటున్నారు. ఎటువంటి నిర్బంధాలు లేకుండా కౌలు రైతులందరినీ గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

– పిల్లి సూర్యప్రకాశ్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్